నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 13 ఏప్రిల్ 2025 | HYDERABAD



**క్షీరాభిషేకం** మచ్చ బొల్లారం డివిజన్ జనప్రియ అపార్ట్‌మెంట్ వద్ద ఆర్‌యూబీ మంజూరుకు కృషి చేసిన సందర్భంగా ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తదితరులు -మల్కాజిగిరి, ఏప్రిల్ 12



**ఘన స్వాగతం** జైలు నుంచి విడుదలైన విద్యార్థి నవీన్‌కుమార్‌కు హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఘనస్వాగతం పలికిన విద్యార్థులు

# జై హనుమాన్..

## ఆంజనేయ స్వామి ఆలయాలకు పోటెత్తిన భక్తులు

నగరం జై హనుమాన్ నామ స్మరణతో మార్మోగింది. శనివారం హనుమాన్ జయంతిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గ్రేటర్‌వ్యాప్తంగా ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. గౌలిగూడ రామాలయం నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర హనుమాన్ విజయయాత్ర శోభాయమానంగా జరిగింది. పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. నగర సీపీ సీవీ ఆనంద్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. విజయయాత్ర ప్రశాంతంగా ముగియడంతో సహకరించిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.





హనుమాన్ విజయయాత్రలో భక్తజనం





కర్మన్‌ఘాట్‌లోని ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో ఎమ్మెల్సీ కవిత పూజలు

## కేసీఆర్ ముందు చూపు..


# పేదలకు దక్కిన భరోసా

## కిడ్నీ రోగులకు పునర్జీవం

హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర వ్యాప్తంగా డయాలసిస్ కేంద్రాల నిర్వహణ

ప్రధాన హబ్స్‌గా ఉస్మానియా, గాంధీ, నిమ్స్

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ప్రజల ఆరోగ్యంపై కేసీఆర్ సర్కార్ ముందు చూపే నేడు ఎంతో మంది నిరుపేద రోగులకు పునర్జీవం ప్రసాదిస్తున్నది. 'సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే ప్రజలు ఆరోగ్యంగా ఉండాలి....అప్పుడే రాష్ట్రం ఆరోగ్యంగా ఉంటుంది. రాష్ట్రం ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆర్థికంగా ఎదగగలం'అంటూ ప్రజా వైద్యంపై నాటి కేసీఆర్ సర్కార్ ప్రత్యేక దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో రోజురోజుకూ పెరుగుతున్న కిడ్నీ రోగుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని తొలుత నగరంలో డయాలసిస్ కేంద్రాల సంఖ్యను పెంచిన నాటి కేసీఆర్ ప్రభుత్వం.. దశల వారీగా ప్రతి జిల్లాలో కూడా డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. హైదరాబాద్ నగరమే ప్రధాన హబ్‌గా, రాష్ట్రంలోని ఆయా జిల్లాలో పనిచేస్తున్న డయాలసిస్ కేంద్రాలను సిటీలోని ప్రధాన ట్రెషరీ హాస్పిటల్స్ పర్యవేక్షిణలోకి తీసుకువచ్చారు. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 102 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటిని ఉస్మానియా, గాంధీ, నిమ్స్ దవాఖానల పర్యవేక్షణలోకి తీసుకువచ్చిన ఘనత నాటి బీఆర్ఎస్ సర్కార్‌దే.



### క్లస్టర్ల వారీగా సేవలందిస్తున్న 97 కేంద్రాలు

రాష్ట్రవ్యాప్తంగా102 డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టగా, ప్రస్తుతం 97 సెంటర్లు రోగులకు సేవలు అందిస్తున్నాయి. ఈ కేంద్రాలను మూడు క్లస్టర్లుగా విభజించడంతో పాటు ఉస్మానియా, గాంధీ, నిమ్స్ హాస్పిటల్స్‌ను ప్రధాన హబ్స్‌గా ప్రకటించారు. ఒక్కో హబ్ పరిధిలో ఒక్కో క్లస్టర్‌లోని డయాలసిస్ కేంద్రాలు పనిచేస్తున్నాయి. నిమ్స్ హబ్ కింద ఏర్పాటైన క్లస్టర్ పరిధిలో మొత్తం 44 డయాలసిస్ సెంటర్ల ద్వారా ప్రతి రోజూ దాదాపు వెయ్యిమంది నిరుపేద కిడ్నీ రోగులకు సేవలందిస్తున్నాయి. ఉస్మానియా పరిధిలో 27, గాంధీ పరిధిలో 26 డయాలసిస్ సెంటర్లు సేవలందిస్తుండటం విశేషం.

### నగరం నుంచే పర్యవేక్షణ..

97 డయాలసిస్ సెంటర్లను, ముఖ్యంగా పేషెంట్ కేర్, డయాలసిస్ సేవల నాణ్యతను నగరంలోని ఉస్మానియా, గాంధీ, నిమ్స్ దవాఖానల్లోన్ని నెఫ్రాలజీ విభాగం వైద్యులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. అంతేకాకుండా డయాలసిస్ కేంద్రాల్లో సేవలందించే వైద్యసిబ్బందికి అవగాహన కల్పించడం, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలపై వారికి అవగాహన కల్పిస్తారు.




నెల రోజుల కిందట గ్రేటర్‌లో మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తిని వీధి కుక్క కరిచింది. ఏమవుతుందిలే.. అని అతడు నిర్లక్ష్యం చేశాడు. ఇంట్లో వాళ్లకు చెప్పలేదు... వైద్యశాలకు పోలేదు.. కనీసం ప్రథమ చికిత్స కూడా చేయించుకోలేదు... అది ఇన్‌ఫెక్షన్‌కు దారి తీసి.. చివరకు అతడు రేబిస్‌తో చనిపోయాడు.

# కుక్కలు.. భౌబోయ్!

## ఏడు రోజులు.. 603 కుక్క కాట్లు

### సిటీని వణికిస్తున్న వీధి కుక్కలు

ఒక్క ఫీవర్ ఆసుపత్రికే రోజుకు పదుల సంఖ్యలో బాధితులు

ఉష్ణోగ్రతలు పెరగడంతో కుక్కల్లో 'ఇరిటేషన్'



పాఠశాలకు సెలవు ఇవ్వడంతో సికింద్రాబాద్ ఏరియాలో కొందరు పిల్లలు బయట ఆడుకుంటున్నారు. అందులో ఎనిమిదో తరగతి చదువుతున్న శివకేశవ్‌పై రెండు వీధి కుక్కలు విరుచుకుపడ్డాయి. కాళ్ల భాగంలో కరవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే తల్లిదండ్రులు ఆసుపత్రికి తీసుకుపోవడంతో చికిత్స అనంతరం కోలుకున్నాడు..

ఇలా నగరంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దొరికిన వారిని దొరికినట్లు కరుస్తున్నాయి. దీనికితోడు ఎండాకాలం కావడంతో ఇరిటేషన్ పెరిగి మరింతగా విరుచుకుపడుతున్నాయి. ఫలితంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోజురోజుకు కుక్కకాటు బాధితులు పెరిగిపోతున్నారు. ఒక్క ఫీవర్ ఆసుపత్రిలోనే రోజుకు పదుల సంఖ్యలో బాధితులు వస్తుండటం ఆందోళన కలిగించే అంశం.

**సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ):** నగరంలో వీధి కుక్కలు దడపుట్టిస్తున్నాయి.. రోజురోజుకు కుక్కకాటు బాధితులు పెరిగిపోతుండటం ఆందోళన కలిగిస్తున్నది. చిన్నా..పెద్దా తేడాలేకుండా.. దాడి చేస్తున్నాయి. గతేడాది ఏప్రిల్, మే, జూన్ ప్రారంభ సమయానికి 2,700 మంది బాధితులు కుక్కకాటుతో ఫీవర్ ఆసుపత్రిలో చికిత్స పొందగా, వారం రోజులుగా ఫీవర్ ఆసుపత్రికి కుక్కకాటుకు గురై సుమారు 600 మంది చికిత్స కోసం రావడం ఆందోళన కలిగించే అంశం. కాగా, గ్రేటర్‌లో 2023లో రేబిస్ వ్యాధి సోకి 13 మంది మరణించగా, 2024లో 24 మంది చనిపోయారు.

### ఉష్ణోగ్రతలు పెరగడంతో..

ఎండాకాలంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల కుక్కల్లో విపరీతమైన ఇరిటేషన్ వచ్చి, దూప ఎక్కువై స్వైరవిహారం చేస్తాయని వైద్యులు తెలిపారు. ఈ క్రమంలో ఆగ్రహంతో ఎవరూ కనిపించినా.. వారి మీద దాడి చేసేందుకు ప్రయత్నిస్తాయని చెప్పారు. ఇరిటేషన్ కారణంగా కుక్కల్లో కరిచే గుణం పెరుగుతుందన్నారు. వీధి కుక్కలు, పెంపుడు కుక్కలు రెండూ కూడా కరిచే స్వాభావం కలవేనని, అయితే పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్‌తో సహా ఎప్పటికప్పుడు ఆహారం, నీళ్లు ఇవ్వడంతో వాటి నుంచి ప్రమాదం ఉండటం లేదు. కానీ వీధి కుక్కలకు సరైన సమయంలో ఆహారం, నీళ్లు దొరకక కనిపించిన వారిపై దాడి చేసి, కరుస్తున్నాయి. ప్రధానంగా పిల్లల మీద ఇవి ఎక్కువ ప్రతాపాన్ని చూపుతున్నాయి. గతేడాది అనేకచోట్ల పిల్లలు, మహిళలపై వీధి కుక్కలు దాడి చేశాయి.

### స్టెరిలైజేషన్ సరిగా జరుగుతుందా?

గ్రేటర్ పరిధిలో 2019 పశుగణన లెక్కల ప్రకారం 51వేల కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. కానీ ఆతర్వాత ఇప్పటివరకు గణన జరగలేదు. కానీ వీటి సంఖ్య లక్ష వరకు చేరవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో కుక్కల సంఖ్య ఆధారంగానే (మిగతా IVవ పేజీలో)



# ఐటీ.. సేఫ్టీయే లక్ష్యం

## ఐటీ కారిడార్‌లో భద్రతే మా ధ్యేయం

మహిళా ఉద్యోగుల కోసం 18 'షీ షటిల్' సర్వీసులు

డ్రోన్‌లతో ట్రాఫిక్ సమస్యలకు కారణాల విశ్లేషణ

'నమస్తే'తో ఎస్సీఎస్సీ సెక్రటరీ జనరల్ రమేశ్

**ఐటీ కారిడార్‌లో** భద్రతే మా లక్ష్యమన్నారు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ (ఎస్సీఎస్సీ) సెక్రటరీ జనరల్ రమేశ్ కాజా. తాను అనేక దేశాల్లో పర్యటించానని.. ఐటీ కారిడార్‌లో భద్రత కోసం పనిచేసే ఎస్సీఎస్సీ వంటి సంస్థ ప్రపంచంలో ఎక్కడా లేదని చెప్పారు. 'ఐటీ సంస్థల్లో పనిచేసే మహిళా ఉద్యోగుల భద్రత కోసం 18 'షీ షటిల్' బస్సులను సంస్థ ద్వారా నడుపుతున్నాం. ప్రతినెల 1.80 లక్షల మంది మహిళా ఉద్యోగులు ఈ బస్సుల్లో ప్రయాణిస్తున్నారు. 'షీ సేఫ్' యాప్ ఏర్పాటు చేసి మహిళల భద్రతపై అవగాహన కల్పిస్తున్నాం. ఐటీ కారిడార్‌లో డ్రోన్ కెమెరాలతో ట్రాఫిక్ సమస్యలకు గల కారణాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నాం'.. అని అన్నారు. ఐటీ కారిడార్‌లో పౌరులు స్వేచ్ఛగా జీవించడం, కార్యకలాపాలు, వ్యాపారాలు చేసుకోవడం కోసం కృషి చేయడమే తమ సంస్థ ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. 'నమస్తే'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు.

(వివరాలు IVవ పేజీలో)

## • ఉన్న సిటీని మరిచి..

# ఊహా నగరికి మెరుపులా?



## కాగితాలు దాటని ప్రధాన పెండింగ్ మెట్రో ప్రతిపాదనలు

### ఫ్యూచర్ సిటీకి మాత్రం ఆర్భాటం

నార్త్ సిటీ మెట్రో నిర్మాణంతో 30 లక్షల మందికి ప్రయోజనం

డీపీఆర్ పేరిట జాప్యం

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం గాలిలో మేడలు కడుతోంది. ఉన్న సిటీ అభివృద్ధి మరిచి కాగితాలకే పరిమితమైన ఊహానగరి(ఫ్యూచర్ సిటీ)కి వెంపర్లాడుతోంది. నిత్యం లక్షలాది మంది నివసించే ప్రాంతాలను మరిచి జనావాసాలు లేని ప్రాంతానికి మెట్రో పరుగులు పెట్టిస్తామని గొప్పలు పోతున్నది. విశ్వనగరం అంటే అధునాతన మౌలిక సదుపాయాలు, మెరుగైన రవాణా అవకాశాలు ఉంటే తప్పా.. విదేశీ తరహా జీవన విధానం కనిపించదని భావించిన బీఆర్ఎస్ నగరాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తే, వాటికి విరుద్ధంగా ఉన్న ప్రణాళికలను కాలరాసి, లేని ప్రాంతాలకు అందలమెక్కిస్తూ నట్టేట ముంచేందుకు సిద్ధమవుతున్నది కాంగ్రెస్ సర్కారు. మెట్రో విషయంలో నగరం నలుమూలాల నుంచి రాకపోకలు చేసేందుకు వీలుగా.. విస్తరణ ప్రణాళికలను రాష్ట్ర తొలి సీఎం కేసీఆర్ ప్రాధాన్యతనిస్తే.. రేవంత్ సర్కారు మాత్రం రియల్ భూముల పేరిట, స్వప్రయోజనాల కోసం కాగితాలకే అభివృద్ధి ప్రణాళికలతో మార్కెటింగ్ జిమ్మికులకు దిగుతున్నది. దీంతో నగరంలో అందుబాటులోకి రావాల్సిన మెట్రో మార్గాలు.. ఫ్యూచర్ సిటీ కారణంగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

### గాలిలో మేడలు..

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు గత ప్రభుత్వం ఎన్నో ప్రణాళికలను సిద్ధం చేసింది. ప్రధానంగా మెట్రో విస్తరణ విషయంలో స్పష్టమైన వైఖరితో ప్రణాళికలను రూపొందించింది. ప్రస్తుతం 70 కిలోమీటర్ల మేర ఉన్న మెట్రో వ్యవస్థను శివారు ప్రాంతాలకు విస్తరించి, నిత్యం లక్షలాది మంది ప్రయాణికులకు మెరుగైన రవాణా వ్యవస్థను తీర్చిదిద్దాలనుకున్నది. ఇందు కోసమే రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు, లక్డీకాపూల్ నుంచి గచ్చిబౌలి, మెట్టు గూడ నుంచి ఈసీఐఎల్, జేబీఎస్ నుంచి శామీర్‌పేట, ప్యారడైజ్ నుంచి సుచిత్ర మార్గంతోపాటు, మియాపూర్ టు పటాన్‌చెరు ప్రాంతాలకు మెట్రో మార్గాలను నిర్మించాల అనుకున్నారు. వీటితో ప్రస్తుతం కోర్ సిటీ నుంచి లక్షలాది మంది రాకపోకలు సాగించే వారికి వేగవంతమైన, సౌకర్యవంతమైన రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తుందని భావించి.. ఎన్నికల సమయంలోనూ మెట్రో విస్తరణపై స్పష్టమైన వైఖరితో వ్యవహరించింది. కానీ అధికారంలో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నగరాభివృద్ధికి కీలకమైన ప్రతిపాదనలు తుంగలో తొక్కి... గాలిలో మేడలు కట్టేందుకు సిద్ధమైంది.

### ప్రజాప్రయోజనాలకు మంగళం...

కోర్ సిటీ నుంచి శివారు ప్రాంతాల వరకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం లక్షలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం అవుటర్ రింగు రోడ్డు, లేదా ఎంఎంటీఎస్ వంటి సౌకర్యవంతమైన మార్గాలే ఉన్నాయి. వీటికంటే మరింత వేగవంతమైన రవాణా వ్యవస్థ కోసం నగరం నలువైపులా మెట్రో విస్తరించాలని బీఆర్ఎస్ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ క్రమంలో నిత్యం 30 లక్షల జనాభా ఉండి, కోర్ సిటీకి 5-6లక్షల మంది రాకపోకలు సాగించే నార్త్ సిటీ ప్రాంత అభివృద్ధి ప్రాధాన్యతనిస్తూ.. మెట్రో విస్తరణ ప్రణాళికలు రూపొందించింది. దీనికోసం శామీర్‌పేట, సుచిత్ర, ఈసీఐఎల్‌తోపాటు, నార్త్ వెస్ట్‌లోని పటాన్‌చెరు మార్గాలను, ఈస్ట్ సిటీలో ఘట్‌కేసర్ వరకు, రాయదుర్గం నుంచి శంషాబాద్ వరకు మెట్రోను విస్తరించి ప్రజలకు ప్రయోజనం కలిగించే రవాణా వ్యవస్థలను అభివృద్ధి చేయాలని భావించింది. కానీ అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ప్రజావసరాలకు పాతరేసి ప్రణాళికలను చిన్నాభిన్నం చేసింది. ఈ క్రమంలో ఇప్పటికిప్పుడు అవసరమే లేని ప్రాంతానికి మెట్రో లైన్ వేసేందుకు సిద్ధమైంది. రాయదుర్గం మీదుగా శంషాబాద్ వరకు నిత్యం లక్షలాది మందికి ఉపయోగపడే ఎయిర్‌పోర్టు మెట్రో అలైన్‌మెంట్‌ను మార్చి... నాగోల్, ఎల్బీనగర్, చాంద్రాయణగుట్ట మీదుగా ఎయిర్‌పోర్టు చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. అదేవిధంగా జన సంచారమే లేని ఫ్యూచర్ సిటీ కోసం శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి అలైన్‌మెంట్‌లో (మిగతా IVవ పేజీలో)

# నేడు మల్కాజిగిరికి కేటీఆర్ రాక



మేడ్చల్, ఏప్రిల్12(నమస్తే తెలంగాణ): ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభ విజయవంతం కోసం పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడంలో భాగంగా ఆదివారం మల్కాజిగిరిలో నిర్వహించే సన్నాహక సభలో పాల్గొనేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వస్తున్నట్లు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మల్కాజిగిరిలో భారీ ర్యాలీ అనంతరం లక్ష్మీసాయి గార్డెన్స్‌లో ఉదయం 10 గంటలకు సభ ఉంటుందన్నారు.

# 50 ఎకరాలపై కన్ను..

ఎమ్మెల్యే బంధువు అండతో కబ్జాకు ప్రయత్నం

సమగ్ర దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేసిన హైకోర్టు

(మిగతా IIవ పేజీలో)



# ఇంకా జీతాలు రాలే!

## ఎంఎన్‌జేలో సిబ్బందికి వేతన కష్టాలు

కొందరికే సకాలంలో వేతనాలు పడిన వైనం

(మిగతా IVవ పేజీలో)